క్లుప్తంగా

పడిపూజ..



పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

తిరుమలాయపాలెం: మండలంలోని పాతర్లపాడులో అయ్యప్ప మాలధారుల పడిపూజ శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా 200 మందికి పైగా మాలధారులు పూజలు, భజనల అనంతరం నిప్పుల గుండంలో నడిచారు. ఈ కార్యక్రమానికి కేరళకు చెందిన నంబూద్రి గురుస్వామి హాజరు కాగా మాలధారులు పాసినేని శ్రీనివాస్, అలుదాసు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

నేడు మహాపడి పూజ

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని ముస్తఫానగర్ మోర్ సూపర్ మార్కెట్ వద్ద శనివారం సాయంత్రం మహాపడి పూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీ దివ్య మణికంఠ అన్నదాన సేవా సమితి ట్రస్టు చైర్మన్ చిర్ర రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భజన, వేషధారణ, నృత్య ప్రదర్శన వంటి కార్యక్రమాలు నిర్వహించబడతాయని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పేర్కొన్నారు.

ధ్యానమండలి రజతోత్సవం..

ఖమ్మంగాంధీచౌక్: శ్రీ సత్యసాయి ధ్యానమండలి చారిటబుల్ ట్రస్టు 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంలోని కాల్వొడ్డు ఎఫ్‌సీఐ గోదాం వద్ద(సారధినగర్) ఓ ఫంక్షన్ హాల్‌లో రజతోత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ భిక్షమయ్య గురూజీ ఆధ్వర్యాన రూపొందిన చారిటబుల్ ట్రస్టు ఖమ్మం శాఖ రజతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు హోమం, 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, సభా కార్యక్రమం ఉంటుందని, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రవచనాలు కూడా ఉంటాయని తెలిపారు. మధ్యాహ్నం అన్న ప్రసాద కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జాతీయ రహదారి నిర్మాణ పనులు పరిశీలన

నేలకొండపల్లి: కోదాడ–కురవి జాతీయ రహదారి నిర్మాణ పనులను నేషనల్ హైవే అథారిటీ రీజియనల్ అధికారి రజాక్ పరిశీలించారు. మండలంలోని పైనంపల్లి నుంచి తిరుమలాపురం, నేలకొండపల్లి, గువ్వలగూడెం గ్రామాల వద్ద జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనులను పరిశీలించి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులలో ఇంకా వేగం పెంచాలని సూచించారు. ఆయన వెంట నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.దుర్గాప్రసాద్, జిల్లా మేనేజర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణ ఘటనపై కేసు నమోదు

కూసుమంచి: కూసుమంచిలోని బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన దాడి ఘటనకు సంబంధించి ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని గన్యాతండాకు చెందిన గుగులోత్ రాందాస్‌పై హట్యాతండాకు చెందిన గుగులోత్ రమేశ్, ఆయన సోదరుడు దాడి చేసి గాయపర్చారని బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు

నేలకొండపల్లి: జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని చెరువుమాధారంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముస్లిం యూత్ ఆధ్వర్యాన శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కనమర్లపూడి పుష్పలత, సొసైటీ మాజీ అధ్యక్షుడు ఈవూరి శ్రీనివాసరెడ్డి, నిర్వహణ కమిటీ ప్రతినిధులు ఇంతియాజ్, రియాజ్, మహబూబ్, ఖయ్యూమ్, ఆసీఫ్, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

కామేపల్లి: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యమని శుక్రవారం ఎంపీడీ విజయభాస్కరరెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చందన అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా పండితాపురం గ్రామంలో ఇంటింటికి తిరిగి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించిన సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో కరోనా వైరస్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నెహ్రూ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓం నమో భగవతే వాసుదేవాయ..!

నేడు వైకుంఠ ఏకాదశి

- వైష్ణవ ఆలయాల్లో ఉత్తర ద్వారం ద్వారా భగవంతుడి దర్శనం
- ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి
- కరోనా నిబంధనల నడుమ ఉత్సవాలు



ఖమ్మం కమాన్‌బజార్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి అలంకరణ (ఫైల్)



ముస్తాబైన శ్రీలక్ష్మీరంగనాథ స్వామి ఆలయం

ఖమ్మంగాంధీచౌక్: వైష్ణవ ఆలయాల్లో ముక్కోటి సందడి నెలకొంది. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని స్వామి వారి దర్శనం కోసం దేవాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ధనుర్మాసోత్సవాల్లో ముక్కోటి ఏకాదశికి ఎంతో ప్రాముఖ్యత ఉండడంతో జిల్లా వ్యాప్తంగా నేడు(శనివారం) వేడుకల నిర్వహణకు వైష్ణవ ఆలయాలను సిద్ధం చేశారు. సూర్యుడు ఉత్తరాయణానికి మారే ముందు వచ్చే ధనుర్మాస శుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశి లేదా ముక్కోటి అని పిలుస్తారు. సూర్య భగవానుడు ధనస్సులో ప్రవేశించిన అనంతరం మకర సంక్రమణ వరకూ జరిగే మార్గం మధ్య ముక్కోటి ఏకాదశి వస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ఈ రోజున వైకుంఠ వాకిళ్ల తెరుచుకొని ఉంటాయనే నమ్మకంతో భక్తులు వైష్ణవాలయాల వద్ద ఉత్తర ద్వారం ద్వారా భగవంతుడిని దర్శనం చేసుకుంటారు. ఇందుకోసం వైష్ణవాలయాల్లో ఉత్తర ద్వారాన్ని తెరిచి ఉంచుతారు. ఈ రోజున మహా విష్ణువు గరుడ వాహనధారుడై మూడుకోట్ల దేవతలతో భూలోకానికి వచ్చి భక్తులకు దర్శనమిస్తాడని పురాణాలు వివరిస్తున్నాయి. ఈ ఒక్క ఏకాదశి మూడు కోట్ల ఏకాదశులతో సమానమని, ఈ పవిత్రతను గుర్తించి ఈ ఏకాదశిని ముక్కోటి ఏకాదశిగా వైభవంగా జరుపుకోవటం ఆనవాయితీగా వస్తోంది.

వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు..

ముక్కోటి వేడుకలకు జిల్లాలోని వైష్ణవ దేవాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముక్కోటి రోజు భక్తులు ఉపవాసాలు, జాగరణలు ఉండి స్వామి వారిని దర్శించుకుంటారు. ఈమేరకు రద్దీకి అనుగుణంగా బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. ఖమ్మంలోని కమాన్ బజార్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ముక్కోటి వేడుకలు ప్రత్యేకంగా జరుపనుండగా.. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. స్వామి వారి దర్శనానికి కమాన్ బజార్ రహదారుల వెంట వరకు కూడా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అలాగే, త్రీటౌన్‌లోని హర్కారా బావి సెంటర్ సమీపాన రంగనాయకుల గుట్టపై ఉన్న శ్రీలక్ష్మీరంగనాథస్వామి దేవాలయంలో కూడా ధనుర్మాస ఉత్సవాలను ప్రత్యేకంగా జరుపుకోవడంతోస్వామివారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇక కస్బాబజార్‌లోని రామాలయం, ఎన్ఎస్‌పీ రోడ్‌లోని రామాలయం తదితర ఆలయాల్లో ముక్కోటి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కరోనా నిబంధనలకు అనుగుణంగా..

ముక్కోటి వేడుకల సందర్భంగా ఆలయాలు భక్తకోటి జనంతో కిక్కిరిసే అవకాశం ఉండడంతో కరోనా నిబంధనలను అమలు చేసేందుకు ఆలయ నిర్వాహకులు తగిన చర్యలు చేపట్టారు. ప్రభుత్వం, వైద్యుల సూచనలు పాటించే విధంగా ఆలయాల వద్ద చర్యలు తీసుకునేందుకు కమిటీలు ముందుకు వస్తున్నాయి. ఓ వైపు ముక్కోటి వేడుకలు విజయవంతం, మరో వైపు భక్తులు ఇబ్బందులు పడకుండా ఉండేలా ఏర్పాట్లు చేశారు. తప్పనిసరిగా మాస్కులు ధరించడం, క్యూ లైన్లలో భౌతిక దూరాన్ని పాటించడం వంటి నిబంధనలను ఇప్పటికే భక్తులకు సూచనలు చేస్తున్నట్లు అర్చకులు, పండితులు తెలిపారు.

తులసిమాల ప్రత్యేకం..

ముక్కోటి అనగానే స్వామివారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకొని తులసి మాలలను సమర్పించడం ప్రత్యేకం. ఇందుకోసం వైష్ణవ ఆలయాల వద్ద తులసి మాలలను ప్రత్యేకంగా విక్రయించేందుకు పలువురు ఏర్పాట్లు చేసుకున్నారు. ముక్కోటి రోజున తులసిమాలలను భగవతుడికి సమర్పిస్తే ఎంతో పుణ్యఫలమని భక్తుల నమ్మకం.

మంత్రి పొంగులేటికి వినతి



మంత్రి శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న హౌసింగ్ సంఘం నాయకులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ అసిస్టెంట్ ఇంజనీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్ల అసోసియేషన్ బాధ్యులు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ 2016 జూలై గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగులు ఇతర శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లోకి డిప్యూటేషన్‌పై వెళ్లారని, వారిని తిరిగి గృహ నిర్మాణ సంస్థను పునరుద్ధరించి మాతృ సంస్థకు ఉద్యోగులను తీసుకురావాలని పలు సమస్యలను విన్నవించి పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి పొంగులేటి త్వరలో సమావేశం నిర్వహిస్తామన్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరామిరెడ్డి, కోశాధికారికుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, జాయింట్ సెక్రటరీ వెంకయ్య, ఉపాధ్యక్షులు అత్తార్, ఫాయూమ్, కార్యదర్శి రఘువీర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పత్తిపాక నాగసులోచన అధ్యక్షతన నిర్వహించిన త్రీటౌన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన వివరాలు అందించాలన్నారు. రోజు వారి కూలీ పనులు వదులుకొని ప్రభుత్వ సేవల కోసం గ్యాస్ ఏజెన్సీలు, రేషన్ షాపుల చుట్టూ వెళ్తున్నారన్నారని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, వై.విక్రం, యర్రా శ్రీనివాసరావు, భూక్య శ్రీనివాసరావు, ఎస్‌కె.సైదులు, లింగయ్య, బండారు వీరబాబు, వెంకట్రావు, శీలం వీరబాబు, ఎస్‌కె.ఇమాం తదితరులు పాల్గొన్నారు.

రాముడి అక్షింతలు, కలశం ఊరేగింపు

రఘునాథపాలెం: అయోధ్య రామ మందిరం నుంచి తీసుకొచ్చిన రాముడి అక్షింతలు, కలశంనకు శుక్రవారం రఘునాథపాలెంలోని బాలాంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అక్కి వెంకటేశ్వర్లు, బ్రహ్మం, బాలాజీ, రామకృష్ణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్ప ఇళ్లను పేదలకు ఇవ్వాలి

ఖమ్మంమయూరిసెంటర్: రాజీవ్ గృహకల్ప ఇళ్లను తక్షణమే పేదలకు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహ్మద్ సలాం అన్నారు. శుక్రవారం లెనిన్‌నగర్‌లో ఎస్‌కె చానా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో వైఎస్సార్ పేదల కలను సాకారం చేసేందుకు రాజీవ్‌గృహకల్ప పేరుతో ఇళ్లను నిర్మించారని, వాటిని ఇప్పటి వరకు పేదలకు ఇవ్వలేదని అన్నారు. వెంటనే ఆ ఇళ్లను పేదలకు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్, ఎస్.కుమార్, జ్వాల నరసింహారావు, ఎండీ.రహమాన్, గౌస్ పాషా, డి.శేఖర్, రమణ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

తిరుమలాయపాలెం: వచ్చే ఏడాది ఫిబ్రవరి 2న ఖమ్మంలో జరిగే టీపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ.వీ. నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని పిండిప్రోలు జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా విధానం, సమాజంలో వస్తున్న మార్పులను విశ్లేషించుకుని ఈ మహాసభలలో పరిష్కార మార్గాలను చూపుతారని, మహాసభల విజయవంతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ పూర్వ సభ్యులు రాయల రవికుమార్, కమ్మకోమటి నాగేశ్వరరావు, వెంకట్రాములు, లక్ష్మీసుజాత తదితరులు పాల్గొన్నారు.

డ్రైడే పకడ్బందీగా చేపట్టాలి



ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: నగర పాలక సంస్థ పరిధిలో డ్రైడేను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను, సిబ్బందిని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం నగరంలోని ముస్తాఫనగర్ ప్రాంతంలో డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించిన కమిషనర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించి, డెంగీ దోమలు నివారణ కోసం చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంటింటికి తిరుగుతూ నిల్వ ఉన్న నీటిని పరిశీలించి ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రతీ మంగళ, శుక్రవారాల్లో తప్పకుండా డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు.

ఘనంగా సెమీ క్రిస్మస్

ఖమ్మంరూరల్/ఖమ్మంసహకారనగర్: ఖమ్మంరూరల్ మండలంలోని కరుణగిరిలో గల హార్వెస్ట్ స్ప్రింగ్ పాఠశాలలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రంగు రంగుల విద్యుత్ దీపాలు, బెలూన్లతో అలంకరించి వేడుకలను నిర్వహించగా.. చిన్నారులు వివిధ రకాల వేషధారణలతో అలరించారు. ఆద్యంతం ఉల్లాసభరితంగా జరిగిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డి, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా నగరంలోని తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యాన నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలలో సొసైటీ అధ్యక్షుడు కోడి లింగయ్య హాజరై కేక్ కట్ చేసినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు బిక్కు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకటరమణ, ప్రచార కార్యదర్శి చావా నారాయణరావు, నాయకులు వెంకన్న, అంజమ్మ, అజ్జత్ బేగ్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు



విజేత జట్టుకు బహుమతి అందిస్తున్న శ్రీధర్‌రెడ్డి

నేలకొండపల్లి: బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యాన మండలంలోని బోదులబండలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు విజయవంతంగా ముగిశాయి. నువ్వా.. నేనా అంటు సాగిన ఈ పోరులో ఖమ్మం జట్టు విజేతగా నిలవగా.. బోదులబండ జట్టు ద్వితీయ స్థానం, గోల్‌తండా జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో యువతను ప్రోత్సహించేందుకు నమో కబడ్డీ పేరుతో ఈ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనంతు ఉపేందర్, సయ్యద్ మోహినుద్దీన్, సీతారాములు, కె.ఉపేందర్, మల్లేశ్, వినోద్, కాసాని ఉదయ్, అనిల్, గోపి, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేరాలి



పిల్లలతో మాట్లాడుతున్న సీఎంఓ రాజశేఖర్

కూసుమంచి: బడి ఈడు పిల్లలను బడిలో చేరేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సీఎంఓ (కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్) రాజశేఖర్ అన్నారు. శుక్రవారం తురకగూడెం వద్ద ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న ఒడిశా కార్మికులతో ఆయన మాట్లాడారు. పిల్లలతో బట్టీల్లో పనులు చేయించొద్దని యజమానులకు సూచించారు. ఎవరైనా పిల్లలను పనుల్లో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం బడీడు పిల్లలందరూ పాఠశాలల్లోనే ఉండాలని, లేకుంటే వారిని గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం బడి బయట ఉన్న, మధ్యలో చదువు మానేసిన పిల్లలను గుర్తించే సర్వే ముమ్మరంగా సాగుతుందని సీఎంఓ వివరించారు.బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ జాఫర్, స్రాంగ్ టీచర్ పాపారావు పాల్గొన్నారు.

నేరుగా విత్తే విధానంతో అధిక దిగుబడులు

నేలకొండపల్లి: నేరుగా వరి విత్తే విధానంతో రైతులు అధిక దిగుబడులు సాధిస్తారని కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎస్.విజయచంద్ర సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ విధానంలో పంట కాలం తక్కువగా ఉండడంతో పాటు ఖర్చు తగ్గి, దిగుబడి పెరుగుతుందన్నారు. తడి, పొడి పద్ధతులను సాగు చేసుకోవచ్చని చెప్పారు. యాజమాన్య పద్ధతులను రైతులు పాటించాలని, మోతాదుకు మించి ఎరువులు వాడొద్దని సూచించారు. ఈ సదస్సులో మండల వ్యవసాయాధికారి దేశబోయిన అరుణకుమారి, వ్యవసాయ విస్తరణాధికారులు దుర్గాభవాని, అవినాశ్, శిరీష, శశిరేఖ, సాయి, నిఖిల, రామకృష్ణ, అరవింద్, ఉదయ్, సొసైటీ డైరెక్టర్లు మైశా శంకర్, మన్నె కృష్ణారావు, రైతు ప్రతినిధులు గరిడేపల్లి రామరావు, బండారుపల్లి వెంకటేశ్వర్లు, పావులూరి వెంకటేశ్వరరావు, బాజా నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంకు అద్దె బస్సుల యాజమానుల వినతి



వినతి పత్రం అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

ఖమ్మం మామిళ్లగూడెం: అద్దె బస్సుల సమస్యలపై అద్దె బస్సుల యాజమానులు ఖమ్మం రీజియన్ కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం ఆర్టీసీ ఖమ్మం రీజియన్ కార్యాలయంలో ఆర్‌ఎం సీహెచ్.వెంకన్నకు వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఖమ్మంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నకిరికంటి సత్యం బాబు, పి.రవి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు చంద్ర రామకృష్ణ మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో కెపాసిటీకి మించి జనం ప్రయాణం చేస్తుండడంతో అంతకు ముందు ఉన్న ఖర్చు కంటే నాలుగురెట్లు పెరిగాయని వాపోయారు. ప్రస్తుతం చెల్లించే అద్దె కంటే కనీసం రెండు రూపాయలు పెంచితేనే కానీ తాము బస్సులు నడపలేమన్నారు. అన్ని బస్సులకు 4.5 కేఎంపీఎల్ చేయాలని, ఇన్సూరెన్స్ ప్రయాణికులందరితో పాటు బస్సుకు కూడా వచ్చే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బారావు, ఖమ్మం డిపో ఇన్‌చార్జ్ నరేందర్, రాంబాబు, మధిర డిపో ఏవీ రావు, డిపోల యజమానులు పాల్గొన్నారు.

గణిత మేధావి రామానుజన్

ఘనంగా గణిత దినోత్సవం

గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులకు గణిత దినోత్సవం ప్రాధాన్యతను తెలియజేసి గణిత ఉపాధ్యాయులను సన్మానించారు. కాగా, పలు విద్యాలయాల్లో నిర్వహించిన మ్యాథ్ ఎక్స్‌పోలో విద్యార్థుల గణిత ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. – సాక్షి నెట్‌వర్క్



రెజొనెన్స్‌శ్రీనగర్‌లో బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి అబ్దుల్ జావీద్‌పాషా, డైరెక్టర్ శ్రీధర్‌రావు, తదితరులు



హార్వెస్ట్‌లో గణిత ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న కరస్పాండెంట్ రవిమారుత్ తదితరులు



ఖమ్మం సహకారనగర్: శ్రీచైతన్య ఒలంపియాడ్‌లో గణిత దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



ఖమ్మం సహకారనగర్: సర్వజ్ఞలో నిర్వహించిన గణిత దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్లు నాగేంద్రకుమార్, నీలిమ



న్యూవిజన్ పాఠశాలలో రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



ఖమ్మం సహకారనగర్: గీతాంజలిలో.. కరస్పాండెంట్ అప్పారావు, డైరెక్టర్లు పద్మ, అరుణ్



కామేపల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విద్యాసాగర్



నేలకొండపల్లి: బోదులబండ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



తిరుమలాయపాలెం: సుబ్లేడు జెడ్పీ పాఠశాలలో విద్యార్థికి బహుమతి అందజేస్తున్న హెచ్ఎం



ఖమ్మంరూరల్: మంగళగూడెం ఉన్నత పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు